క్లుప్తంగా

ఆసుపత్రిలో అనాథగా చికిత్స



అనాథ వ్యక్తి

కర్నూలు(హాస్పిటల్): అతను ఎవ్వరో తెలియదు...ఎక్కడి నుంచి వచ్చాడో ఎవ్వరికీ సమాచారం లేదు. తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. నగరంలోని ఓ చోట పడి ఉంటే స్థానికులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తెచ్చి వదిలేసి వెళ్లిపోయారు. క్యాజువాలిటిలో ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రిలోని ఏఎంసీ విభాగంలోనికి మంగళవారం చేర్చారు. కుటుంబసభ్యులు ఎవ్వరైనా గుర్తించి అతని కోసం రావాలని ఆసుపత్రి అధికారులు కోరుతున్నారు.

గర్భిణికి ప్రాణం పోశారు



డిశ్చార్జ్ అవుతున్న బాలింతతో డాక్టర్ వెంకటరమణ, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న గర్భిణికి అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు ప్రాణం పోశారు. మంగళవారం ఆసుపత్రిలోని గైనిక్ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. వెంకటరమణ వివరాలు వెల్లడించారు. 'దేవనకొండకు చెందిన కె. సుజాత మూడో కాన్పు కోసం గత నెల 21వ తేదీన ఆసుపత్రిలో చేరింది. ఆమెకు నిర్వహించిన వైద్యపరీక్షల్లో గర్భసంచిలో మాయ పైకి గాకుండా కిందకు ఉంది. దీనివల్ల ఆమె ప్రసవం అయితే వెంటనే తీవ్ర రక్తస్రావమై మరణిస్తుంది. దీంతో మూడు వారాల పాటు ఆమెను వార్డులో చేర్చుకుని సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. తర్వాత వెంటనే గర్భసంచిని తొలగించి ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఈ క్రమంలో 8 యూనిట్ల రక్తం, రెండు యూనిట్ల ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. ఇప్పుడు ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయి ఇంటికి వెళుతుంద'ని హెచ్‌ఓడీ తెలిపారు. దీంతో పాటు గైనిక్ విభాగంలో గత నెలరోజుల నుంచి 12 మందికి ల్యాప్రోస్కోపిక్ ద్వారా శస్త్రచికిత్సలు చేశామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, డాక్టర్ సుజాత, పీజీ వైద్యురాలు డాక్టర్ సింధు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని, వారికి కనీస వేతనం అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబి డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోపాల్, అనిత, శేషమ్మ, వెంకటమ్మ, సుబేదా, శోభారాణి, భూదేవి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆప్కాబ్ టీమ్‌పై అనుచిత వైఖరి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు పత్తికొండ శాఖకు తనిఖీకి వెళ్లిన ఆప్కాబ్ డీజీఎం సత్యప్రసాద్, మరో ముగ్గురు ఆప్కాబ్ మేనేజర్లు ,జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఏజీఎం కృష్ణమూర్తిపై ఆ బ్రాంచ్ మేనేజర్ అమర్యాదగా ప్రవర్తించారు. మీ ఐడీ కార్డులు ఏవీ, మెడలో వేసుకోవాలి కాదా.. ఆ మాత్రం తెలియదా...అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. దీంతో వారు విషయాన్ని డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రామాంజనేయులుకు ఫోన్ చేసి తెలియజేశారు. స్పందించిన ఆయన మేనేజర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సస్పెన్షన్ వేటు వేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

నేడు ఉగాది వేడుకలు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు, పంచాంగ శ్రవణం, తెలుగు కాలమాన పట్టిక ఆవిష్కరణ, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ స్వామి మందిరంలో ఉదయం 11 గంటలకు పలు కార్యక్రమాలు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఉగాది వేడుకలు జరుగుతాయని తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కబ్జా, బలగం , ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, దాస్ కా ధమ్కీ, రంగమార్తండ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కబ్జా, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, గీతాసాక్షిగా, దాస్ కా ధమ్కీ, రంగమార్తండ, ఘోస్ట్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సార్, దాస్ కా ధమ్కీ
ఐనాక్స్ : తూ జూఠీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్
రాజ్ : ఘోస్ట్
శ్రీరామ : షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్




మామిడి ఆకులు, టెంకాలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం




పూలబజార్‌లో పూలు కొనుగోలు చేస్తున్న జనం, పెద్దమార్కెట్‌లో నాటుకోళ్లను బేరం ఆడుతున్న దృశ్యం

●పండుగ సందడి

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు నగరంలోని పలు మార్కెట్లు, దుకాణాల వద్ద మంగళవారం పండుగ సందడి నెలకొంది. జనాలు పండుగ కోసం టెంకాయలు, పూలు, పండ్లు, మామిడి తోరణాలు, మామిడి ఆకులు, అరటి పట్టలు, కోళ్ల తదితర వాటి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

15లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

● కలెక్టర్ పి.కోటేశ్వరరావు



హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఏప్రిల్ 15వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు హౌసింగ్ అధికారుల ను ఆదేశించారు. రూఫ్, రూఫ్ కాంక్రీట్ లెవళ్లలో ఉన్న నిర్మా ణాలపై దృష్టి సారించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పీఆర్, హౌసింగ్ జిల్లా, మండలస్థాయి సిబ్బందితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో రూఫ్, రూఫ్ కాంక్రీట్ లెవళ్లలో 3693 ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. వీటిని పూర్తి చేయడానికి పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కర్నూలు, పత్తికొండ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారంలోపు పూర్తి చేయాలన్నారు. ఇంకా మొదలు కాని ఇళ్లను త్వరగా ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఈఈ మాధన్న, డీఈ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో మెరుగైన సేవలు అందించండి

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైరిస్క్ గర్భిణులు ఆసుపత్రిలోనే ప్రసవించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఆరోగ్యమిత్రలు కలసి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందినవారి ఇళ్లకు వెళ్లి వారి అభిప్రాయాలను సేకరించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యులు గ్రామాల పర్యటనకు వచ్చే ముందు రోజే గ్రామస్తులకు సమాచారాన్ని అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రఘు, సీపీఓ అప్పలకొండ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

● 'డయల్ యువర్ ఎస్ఈ'లో ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలపై తక్షణమే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు చెప్పుకున్న సమస్యలను విని నమోదు చేసుకున్నారు. వీటిని నిర్దీత గడువులోపు పరిష్కరించాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అదేవిధంగా స్థానిక పవర్ హౌస్‌లో కర్నూలు రూరల్స్ ఆపరేషన్స్ డివిజన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సెక్షన్ల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ పూర్తయి పది రోజులైందని, బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు శ్రీనివాసబాబు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై దాడి అమానుషం'



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దయ్య

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ సభ్యులు దాడి చేయడం అమానుషమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సభ్యులు అసెంబ్లీ స్పీకర్‌పై వికృత చేష్టలు, దాడికి యత్నించగా అడ్డుకునేందుకు వెళ్లిన ఎమ్మెల్యే సుధకర్‌బాబుపై దాడి చేయడం దారుణమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించి గందరగోళం సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే సుధార్‌బాబుపై టీడీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడించి బుద్ధి చెప్పినా తీరు మారలేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలకు తాకినా అందుకు తగ్గట్లు సమాధానం ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శివ, ముల్లా హుసేన్ సాహెబ్, శ్రీనివాస యాదవ్, అయ్యస్వామి, వెంకట్రాముడు, రమణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

● మేయర్ బీవై రామయ్య




విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం మెనూలో మరో పోషకాహారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో నాడు– నేడు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో విద్యకు వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి కేవలం రూ.450 కోట్లు కేటాయించి, కమీషన్లకు కక్కుర్తిపడి పిల్లలకు నాసిరకమైన భోజనం అందించేవారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికే రూ.1,824 కోట్లు వెచ్చించిందన్నారు. తాజాగా రాగిజావ కోసం ఏటా మరో రూ.86కోట్లు ఖర్చు పెట్టబోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం : ఎమ్మెల్యే కాటసాని

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 35వ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. అంతేగాక విద్యార్థులకు మరింత పోషకాహారం అందించడం కోసం జగనన్న గోరుముద్దలో రాగిజావను చేర్చడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి సహకారం

కర్నూలు (టౌన్): క్రీడాకారుల సంక్షేమం కోసం న్యాయవాది శ్రీధర్ రెడి మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో యోగ అసోసియేషన్ నాయకులకు ఆయన రూ.40 వేలు విలువ చేసే లాప్‌ట్యాప్‌ను సీఈఓ రమణ చేతుల మీదుగా అందజేశారు.

వర్క్ టూ రూల్‌కు సహకరించండి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిల సాధన కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా వర్క్ టూ రూల్ కార్యక్రమానికి సహకారం అందించాలని ఏపీ జేఏసీ నాయకులు గిరికుమార్‌రెడ్డి తదితరులు మంగళవారం కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డిలను కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు (టౌన్): వచ్చే నెల 8న కర్నూలు నగరంలో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం సంబంధించిన పోస్టర్లను కర్నూలు నగర పాస్టర్ల అసోసియేషన్ చైర్మన్ సంజీవరాజు తదితరులు స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆవిష్కరించారు.

సంక్షిప్త సమాచారం

మహిళలకు క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మహిళలకు మంగళవారం వాలీబాల్, త్రోబాల్ పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ నిర్వహించారు.

పాఠశాలల్లో ఉగాది సంబరాలు

కర్నూలు సిటీ: నగరంలోని మాధవినగర్‌లోని నారాయణ స్కూల్లో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, ఏక్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో కేశవరెడ్డి విద్యా సంస్థల్లో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు.

అలరించిన జనకవనం

కర్నూలు కల్చరల్: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన సి.క్యాంప్ టీజీవి కళాక్షేత్రంలో జరిగిన జనకవనం అలరించింది.